

నేడు 'సనాతన ధర్మం-గురజాడ ఆలోచన'పై చర్చాగోష్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గురజాడ అప్పారావు 161వ జయంతిని పురస్కరించుకుని గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి సంయుక్తంగా సనాతన ధర్మం-గురజాడ ఆలోచన అన్న అంశంపై ఈనెల 21న చర్చాగోష్టి నిర్వహిస్తున్నట్లు గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఇల్లీసుపురంలో గల అంబేద్కర్ విజ్ఞాన్ మందిర్‌లో సాయంత్రం ఐదు గంటలకు చర్చాగోష్టి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చర్చాగోష్టిలో సాహితీవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు, సామాజికవేత్తలు పాల్గొంటారని తెలిపారు. సాహితీ అభిమానులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్లాంట్ పరిరక్షణకు 'ఉక్కు' సంకల్పం

- ఉక్కు రక్షణ కోసం సిపిఎం బైక్ యాత్ర
- నేడు ఎచ్చెర్లకు రానున్న ర్యాలీ
- జిల్లాలో మూడు రోజులు సాగనున్న జాతా

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు సిపిఎం పోరాటాన్ని ఉధృతం చేసింది. ప్లాంట్ ప్రయివేటీకరణకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పనుతున్న కుట్రను ప్రజలకు వివరించి చైతన్యపరిచేందుకు సమాయత్తమైంది. ఉత్తరాంధ్ర జిల్లాలో బైక్ జాతా మొదలుపెట్టింది. అందులో భాగంగా విశాఖలో ఈనెల 20న ప్రారంభమైన జాతా గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఎచ్చెర్ల చేరుకోనుంది. వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడ నుంచి ఆమదాలవలస బయలుదేరి వెళ్లనున్నారు. జాతాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైన నేపథ్యం, ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధిలో ప్లాంట్ అవసరం, ప్రయివేటీకరణకు కేంద్రం అనుసరిస్తున్న దుర్మార్గ విధానాలు, రాష్ట్రంలో పాలక, ప్రతిపక్షాల తీరును ప్రజలకు, యువతకు వివరించనున్నారు. జిల్లాలో మూడు రోజుల పాటు జాతా కొనసాగనుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఏర్పాడిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జిల్లాకు చెందిన వేలాది మంది పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ప్రభుత్వానికి ఏటా రూ.వేల కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తోంది. సిఎస్ఆర్ నిధుల ద్వారా ఎన్నో గ్రామాలు, పట్టణాల్లో పలు ప్రాంతాల అభివృద్ధికి పరోక్షంగా దోహదపడుతోంది. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించింది. వీరి



అవసరాలు తీర్చే ట్రాన్స్‌పోర్టు, కూరగాయాలు, టీ, టిఫిన్ వంటి దుకాణాలతో పాటు ఎన్నో వ్యాపారాలు చేస్తూ గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో బతుకీడుస్తున్న వారు వేలాది మంది ఉన్నారు. ఇటువంటి బంగారు బాతు గుడ్డు వంటి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వం నష్టాల పేరుతో ప్రైవేటు సంస్థకు అమ్మేస్తుందన్న వార్త విస్మయానికి గురిచేస్తోంది. ప్లాంట్ ప్రైవేటుపరమైతే ఉద్యోగాలు తగ్గిపోతాయి. ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికుల ఉపాధి భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఏడాది కిందట నుంచి నిరవధికంగా ఆందోళనలు చేస్తున్న విషయం విదితమే. ఇది రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారింది. ఈ నేపథ్యంలో దిశ మార్చుకున్న కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను ముక్కలుగా విభజించి ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి గానీ, ప్రతిపక్ష టిడిపి గానీ, కేంద్రం వద్ద తనకు ఎంతో పలుకుబడి ఉన్నట్టుగా చెప్పుకుంటున్న జనసేన గానీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదు. ఈ మూడు పార్టీలూ లాలూచీ పడడంతో కేంద్రం వెనక్కి తగ్గడం లేదు. ఇటువంటి తరుణంలో మన జిల్లాలోని ప్రతి పల్లె తల్లడిల్లుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి సుమారు రెండు లక్షల మందికి పైగా జీవనం సాగిస్తుండగా, అందులో మన జిల్లాకు చెందిన వారు తక్కువలో తక్కువగా 20వేల మంది ఉంటారని అంచనా. కాంట్రాక్టు కార్మికులే సుమారు ఐదు వేల మంది ఉంటారు. పర్మినెంట్ ఉద్యోగులు మరో రెండు వేల మంది వరకు ఉండవచ్చు. మొత్తం స్టీల్‌ప్లాంట్ ఆధారంగా గాజువాక ప్రాంతంలో జీవిస్తున్న లక్షలాది మందికి పాలు, కూరగాయాలు, టీ, టిఫిన్, హోటల్స్, ఆటోలు, కార్లు నడుపుతూ వేలాది కుటుంబాలు ఉన్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశం ఉత్తరాంధ్ర జిల్లాలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో విశాఖపట్నం జిల్లాతో పాటు విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, పాడేరు జిల్లాల్లోనూ జాతా సాగనుంది.

బైక్ యాత్ర సాగేదిలా...

బైక్ యాత్ర గురువారం మధ్యాహ్నం 4.30 గంటలకు ఎచ్చెర్లకు చేరుకోనుంది. అక్కడ నుంచి బయలుదేరి సాయంత్రం ఆరు గంటలకు ఆమదాలవలస రానుంది. రాత్రి ఎనిమిది గంటలకు శ్రీకాకుళం చేరుకుని బస చేస్తారు. 22న ఉదయం పది గంటలకు శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద నిర్వహించనున్న బహిరంగ సభలో నాయకులు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు నరసన్నపేట, 1.30 గంటలకు టెక్కలి, సాయంత్రం 5.30 గంటలకు పలాస చేరుకోనుంది. రాత్రి సోంపేటలో బస చేయనున్నారు. 23వ తేదీ ఉదయం పది గంటలకు ఇచ్ఛాపురం, 1.30 గంటలకు పాతపట్నం, సాయంత్రం 4.30 గంటలకు కొత్తూరు చేరుకుంటారు. అక్కడి నుంచి సాయంత్రం 5.30 గంటలకు పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చేరుకోనున్నారు.

సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి

ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

ప్రజాశక్తి - రణస్థలం

జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అన్ని విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టిసారించినప్పుడే అర్జీదారుల సమస్యలు పరిష్కారమవుతాయని ఇన్‌ఛారిజ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులకు సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆధ్వర్యాన నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉదయం 10.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో వందలాది మంది అర్జీదారులు వచ్చి తమ గోడును వినిపించుకున్నారు. సమస్యలను సావధానంగా వింటూ వాటికి పరిష్కారమార్గం చూపుతూ అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి నిర్ణీత గడువులో పరిష్కరించాలని నవీన్ ఆదేశించారు. ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లోని మత్స్యకారులు వర్షాలు, తుపాన్లు, పిడుగులు సంభవించిన సమయంలో సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు వెళ్లలేకపోతున్నారని టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. ఇటువంటి సమయంలో సముద్రంలో వేటకు వెళ్లలేక మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోతున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచెర్ల మండలాల్లో విస్తరించి ఉన్న పంట కాలువల ద్వారా ఆయా ఆయకట్టు భూములకు సకాలంలో సాగునీరు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాల్లో విస్తరించి ఉన్న తోటపల్లి రిజర్వాయర్, మడ్డువలస ప్రాజెక్టులకు చెందిన పంట కాలువల ద్వారా ఆయకట్టు భూములకు సకాలంలో సాగునీరు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందనకు రావడం వల్ల ఖర్చు, సమయం ప్రజలకు ఆదా అవుతుందని భావించి రణస్థలం వచ్చి ప్రత్యేకంగా స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై అర్జీలు ఎక్కువగా వచ్చాయన్నారు. హౌసింగ్, కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం, భూ సమస్యలు, గ్రామాల్లో రోడ్లు, కాలువలు తదితర వాటిపై కూడా వినతులు వచ్చాయన్నారు. ముఖ్యంగా మండల స్థాయిలో సమస్యలు మండలస్థాయి అధికారులు స్పందించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, ఆర్‌డిఒ బి.శాంతి, ఎన్నికల అధికారి మురళీకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, రణస్థలం ప్రత్యేక అధికారి దుర్గారావు, తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎంపిడిఒ రమణమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ, ఎంఇఒలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్‌కు సమస్యలను వివరిస్తున్న కలిశెట్టి

మున్సిపల్ ప్రత్యేకాధికారిగా జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి - ఆమదాలవలస



మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ నియమితులయ్యారు. ఈమేరకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ప్రత్యేకాధికారిగా కొనసాగిన ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి స్థానంలో ఆయన నియమితులయ్యారు. జులై మూడో తేదీతో ప్రత్యేకాధికారి పాలనా గడువు ముగియడంతో, మళ్లీ ఈనెల 20న ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి రెండో తేదీ వరకు ఆయన ప్రత్యేకాధికారిగా కొనసాగుతారు. మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో 2019 జులై నుంచి ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతోంది.

23న దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం



పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా విశాఖపట్నం జోన్‌కు సంబంధించి ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు విశాఖపట్నంలోని కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో గత నెల 25వ తేదీ నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నం రేంజ్ డిఐజి కె.హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 25 నుంచి ఇప్పటివరకు దేహదారుఢ్య పరీక్షలకు హాజరు కాని ఎస్ఐ అభ్యర్థులు ఈనెల 23వ తేదీన హాజరు కావాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు హాజరు కాని మహిళా అభ్యర్థులు ఈనెల 22న హాజరు కావచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

త్వరితగతిన ఛార్జిషీట్ల దాఖలు

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జైలులో ఉన్న ముద్దాయిల కేసుల్లో పోలీసులు త్వరితగతిన విచారణ పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కోర్టులో అండర్ ట్రయల్ ప్రిజనర్స్ కమిటీ సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలులో ఉన్న ముద్దాయిల కేసుల పరిష్కారానికి పోలీసులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఛార్జిషీట్లు దాఖలు చేయడంలో అలసత్వం వద్దని సూచించారు. సమావేశంలో అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, ఫణికుమార్, భాస్కరరావు, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి అనురాధ, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ నబిఖాన్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు, పాలకొండ ఎస్‌డిపిఒ జి.వి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు రోడ్డు స్థలం పరిశీలన



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి : మూలపేట అదానీ పోర్టుకు మండలం లోని బన్నువాడ, మోదుగు వలస మీదుగా నిర్మాణం చేపట్టనున్న రోడ్డు స్థలాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ బుధవారం పరిశీలించారు. ఈ ప్రాంతానికి చెందిన రైతులు ఎంతమంది రోడ్డు నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేస్తూ భూములు ఇచ్చారు?, ఇంకా ఎంతమంది భూములు ఇవ్వలేదనే వివరాలతో కూడిన జాబితాను వేర్వేరుగా తయారు చేసి అందించాలని తహశీల్దార్ ప్రవల్లికాప్రియను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, విఆర్‌ఒ దుక్క జోగారావు, సుకన్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

660 జిఒను రద్దు చేయాలి

- పంటల బీమాలో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అనుమతి తగదు
- డిఆర్‌ఒకు రైతుసంఘాల వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న రైతు, కౌలురైతు సంఘం నాయకులు

పంటల బీమాను ప్రైవేటు కంపెనీలకు కట్టబెడుతూ ఈనెల 8న ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నంబరు 660ను రద్దు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలురైతు సంఘం నాయకులు పోలాకి ప్రసాదరావు, భవిరి కృష్ణమూర్తి, పి.చంద్రరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల బీమాలో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రవేశాన్ని నిలిపివేయాలన్నారు. రైతులపై చిత్త శుద్ధి ఉంటే ప్రభుత్వమే పంటల బీమాను అమలు చేయాలన్నారు. 2023-24 ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత పంటల బీమా అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలతో బిడ్డింగ్ నిర్వహించిందని తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాలను వాతావరణ బీమా 9 క్లస్టర్లుగా, దిగుబడి ఆధారిత బీమా 7 క్లస్టర్లుగా నిర్ణయించి అమలు చేయడానికి జిఒ ఇచ్చిందన్నారు. ఈ జిఒలో పేర్కొన్న పంటల బీమా విధానం రైతులకు నష్టదాయకంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీల ప్రయోజనం కోసం రైతాంగానికి నష్టం చేకూర్చే విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నించడం తగదన్నారు. 2020 నుండి 2023 వరకు మూడేళ్ల పాటు పంటల బీమా అమలును పరిశీలిస్తే, రాష్ట్ర ప్రభుత్వం నేరుగా పంటల బీమా అమలు చేసిన 2020-21లో రూ.1700 కోట్లు, 2021-22లో రూ.2,900 కోట్లు రైతులకు పంటల బీమా రూపంలో ప్రయోజనం కలిగిందన్నారు. దీనివల్ల నష్టపోయిన రైతులకు ఎక్కువ ప్రయోజనం చేకూరిందన్నారు. 2022-23లో ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు జరిగిన పంటల బీమా పథకం వల్ల రైతులకు కేవలం రూ.1100 కోట్లు మాత్రమే బీమా పరిహారం వచ్చిందన్నారు. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని పంటల బీమాలో ఇన్సూరెన్స్ కంపెనీల ప్రమేయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకం అమలు కోసం విడుదల చేసిన జిఒ 660ని తక్షణమే రద్దు చేయాలన్నారు. పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వమే తన బాధ్యతగా అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగి పంటల బీమా పథకంలో ఇన్సూరెన్స్ కంపెనీలను అనుమతించవద్దన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పాలసీ ఇన్సూరెన్స్ కంపెనీల లాభాల కోసమే తప్ప రైతుల ప్రయోజనం కోసం కాదని విమర్శించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా అమలును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 2022-23లో పంటలు నష్టపోయినా పంటల బీమా అమలు కాని రైతులందరికీ పంటల బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

సమిష్టి కృషితో సత్ఫలితాలు

శ్రీకాకుళం అర్బన్ : గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వనరులు సమకూర్చేందుకు పంచాయతీ కార్యదర్శులు ఇతర శాఖల సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జె.మురళి అన్నారు. ప్రణాళికాబద్ధంగా సమిష్టి కృషితో మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు వృత్తి శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిపాలనలో కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న మెళకువలను, నియమ నిబంధనలను ఉపయోగించుకుని పంచాయతీలను అభివృద్ధిపథంలో నడిపించాలని తెలిపారు. ఆదాయ వనరులను సృష్టించడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించడంలో నిర్లక్ష్యం లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అర్హులైన ఏఒక్క కుటుంబాన్నీ విస్మరించవద్దని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్, హార్ట్‌ఫుల్ సంస్థ ప్రతినిధి లక్ష్మణరావు డిఎల్‌పిఒ గోపిబాల, ఐ.వి రమణ, పి.వి రాజు, ఎస్.లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - సోంపేట

స్పందనలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బారువ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, గదులు, రిసెప్షన్ సెంటర్, కేసు దర్యాప్తు ఫైళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాపర్టీ గదిని సందర్శించి ప్రాపర్టీ వివరాలపై ఆరా తీశారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పలు ముఖ్యమైన కేసుల దర్యాప్తు సరళని పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసును త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గ్రామస్థాయిలో సమాచారాన్ని సేకరించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా దత్తత కానిస్టేబుళ్లు తరుచుగా గ్రామాల్లో సందర్శించాలన్నారు. రోడ్డు భద్రతపై, మత్తు పదార్థాల అనర్థాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డి, సోంపేట సిఐ రవిప్రసాద్, ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక



విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

219 విద్యుత్ సమస్యలు పరిష్కారం

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్మన్ సత్యనారాయణ

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ఈ ఏడాదిలో వినియోగదారుల నుంచి 316 సమస్యలు రాగా, అందులో ఇప్పటికే 219 పరిష్కరించామని, ఈనెలాఖరుకు మిగతా వాటినీ పరిష్కరించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్‌ఎఫ్) ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తే సిజిఆర్‌ఎఫ్ దృష్టికి తీసుకొచ్చి సమస్య పరిష్కరించుకోవచ్చునన్నారు. కార్యాలయ సిబ్బందికి చెప్పినా పట్టించుకోకపోతే 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు చెప్పుకోవచ్చని సూచించారు.

ఇపిడిసిఎల్ పరిధిలోని తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల సమస్యలు ఎక్కువగా వచ్చాయని, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి తక్కువ సమస్యలు వచ్చాయని తెలిపారు. ఈ ఏడాది సిజిఆర్‌ఎఫ్ ద్వారా 101 మంది లబ్ధిదారులకు రూ.5.49 లక్షల నష్టపరిహారం చెల్లించామన్నారు. కోటబొమ్మాళిలో మూడు కేసులు విచారించామని, ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని, విద్యుత్‌ను పునరుద్ధరించాలని, హైటెన్షన్ విద్యుత్ వైర్లను మార్చాలని, చీపుర్లపాడులో పాఠశాలపై విద్యుత్ లైన్లు మార్చాలని ఫిర్యాదు చేశారన్నారు. అంతకుముందు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు విద్యుత్ సమస్యలు, పరిష్కారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిజిఆర్‌ఎఫ్ ఆర్థిక సభ్యులు ఎస్.హరిబాబు, స్వతంత్ర సభ్యులు, విశ్రాంత సంచాలకులు ఎపి స్టడీ సర్కిల్ రాయసం సురేంద్రకుమార్, విద్యుత్‌శాఖ డిఇ శంకరరావు, ఎఇ జి.వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

నేడు యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార యాత్ర

ప్రజాశక్తి - మందస

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ప్రచార యాత్రను ఈనెల 21న ఇచ్ఛాపురం నుంచి ప్రారంభిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ తెలిపారు. మండలంలోని హరిపురంలో బైక్ జాతా సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండు జాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి జాతా ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు రెండో జాతా హిందూపురం నుంచి విజయవాడ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇచ్ఛాపురంలో యాత్ర ప్రారంభమై జిల్లాలో సోంపేట, హరిపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం వరకు సాగుతుందన్నారు. ఈనెల 29వ తేదీకి విజయవాడ చేరుకుంటుందని చెప్పారు. అక్టోబర్ ఒకటో తేదీన విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

1974లో ఆవిర్భవించిన యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలపై స్పందిస్తూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా పనిచేస్తోందన్నారు. స్వర్ణోత్సవ సంబరాలను అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, అకడమిక్ సెల్ కో-కన్వీనర్ గున్న రమేష్, సిపిఎస్ కన్వీనర్ దాసరి ఈశ్వరరావు, పిన్నింటి కొండలరావు, కంచరాన మాధవరావు, జన్ని సోమేశ్వరరావు, గున్న చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పగడాలమ్మ

మెరుగైన ఫలితాలకు కృషి

ప్రజాశక్తి- టెక్కలి

ఈ విద్యా సంవత్సరంలో జరగనున్న పదో తరగతి ఫలితాల్లో టెక్కలి డివిజన్ ముందంజలో ఉండేవిధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, ఇందుకు తగ్గ ప్రణాళికలు ఇప్పటి నుంచే వేసుకోవాలని టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి గార పగడాలమ్మ సూచించారు. స్థానిక ప్రణవి కళాశాల ఆవరణలో టెక్కలి డివిజన్‌లోని ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో టెక్కలి డివిజన్ ద్వితీయ స్థానం సాధించుకుందని అన్నారు. జగనన్న ఆణిముత్యాలుకి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాదీ మెరుగైన ఫలితాలు సాధనలో ముందుండాలన్నారు. పాఠశాలల్లో ఆమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం అమలుపై ప్రధానోపాధ్యాయులు దృష్టిసారించి పౌష్టికాహారం అందించడంతో రాజీ పడవద్దని ఆదేశించారు. విద్యాసంవత్సరంలో అనుసరిస్తున్న కేలండర్ ప్రకారం విధులు నిర్వర్తనలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ అవసరమని అన్నారు. అనంతరం పాఠశాలల్లో అమలవుతున్న గ్రీన్‌కోర్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. సమావేశంలో డివిజన్‌లోని డిసిఇబి కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, పరీక్షల విభాగం కన్వీనర్ డి.లక్ష్మీనారాయణ, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ ఎన్.కుమారస్వామి, ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షులు వి.సత్యనారాయణ, కోశాధికారి చిలుకు కృష్ణారావు, రామకృష్ణ, కుప్పిలి నగేష్, ప్రకాష్, సిహెచ్.రమేష్, బెనర్జీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సోంపేట: గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 21, 22, 23వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు బారువ నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ బి.మారుతిరావు బుధవారం తెలిపారు. అండర్-14 విభాగంలో పి.నిషా (లాంగ్ జంప్), అండర్-16లో జి.యశ్వంత్ హేమర్ త్రో), అండర్-18లో ఎం.అఖిల్, బి.కృష్ణ (షార్ట్‌పుట్), శ్రీధర్ (హేమర్ త్రో), అండర్-20లో జి.మధు (హేమర్ త్రో), అండర్-23లో వై.కార్తిక్ (జావలిన్ త్రో) పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కోచ్‌తో పాటు ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు అభినందించారు.

డొంకూరు విద్యార్థులు...

ఇచ్ఛాపురం : 36వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2023 రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా ఆర్ట్స్ కాలేజ్ వేదికగా జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో బాలికల హై జంప్, అండర్16 విభాగంలో టి. జయలక్ష్మి, అండర్ 18వ విభాగంలో డి.యోగేశ్వరి, షాట్ పుట్ లో బి. భరత్ చంద్ర ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరు వేదికగా ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు జరిగే పోటీలో పాల్గొంటున్నారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.సరోజిని, పిడి వాజీర్‌అహ్మద్ అభినందించారు.


ఇచ్ఛాపురం : అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొనసాగుతున్న టిడిపి నిరసన దీక్షలు


ఆమదాలవలస : మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

వైసిపి పాలనలో యువతకు తీరని అన్యాయం జరిగిందని టిడిపి జిల్లా అధ్యక్షుడు నియోజకవర్గ ఇన్చార్జ్ కూన రవికుమార్ అన్నారు. బుధవారం ఆమదాలవలస పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద మేము సైతం రిలే నిరాహార దీక్షలో నాలుగు మండలాలు మున్సిపాలిటీకి చెందిన తెలుగు యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ దీక్ష ప్రాంగణానికి విచ్చేసి తెలుగు యువత దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని యువత పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని అన్నారు. ఇప్పటివరకు ఒక్క డిఎస్‌సి ద్వారానైనా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయలేదని ఎద్దేవా చేశారు. యువతకు ఇచ్చే సబ్సిడీ రుణాలను అటకెక్కించారని మండిపడ్డారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని స్పీకర్ తమ్మినేని సీతారాం తరచూ చెబుతూ ఉంటారని, ఆయన ఫేక్ డిగ్రీ పట్టాపై తెలంగాణ రాష్ట్రంలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో తాను ఫిర్యాదు చేస్తే ఇక్కడి నుంచి అక్కడి తాబేదారులకు ఫోన్ చేసి మేనేజ్ చేసిన వ్యక్తి సీతారాం అని విమర్శించారు. చట్టం ఆయనకు చుట్టమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, పేడాడ జనార్దనరావు, బలగ శంకర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు రిమాండ్‌ను నిరసిస్తూ... ఎస్‌సి ఎస్‌టి సెల్ అధ్యక్షులు సత్తి సంతోష్ ఆధ్వర్యాన లావేరు నుంచి ఎచ్చెర్ల టిడిపి కార్యాలయం వరకూ బైక్‌ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీకి ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, లావేరు మాజీ ఉప సర్పంచ్ ఉప్పడ లక్ష్మణరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గండి సురేష్, ఇనప నాగరాజు, ఉప్పడ నాగార్జున, కొర్రయ్ తవిటియ్య, లండ అచ్చన్న, తార రాము పాల్గొన్నారు.

చంద్రబాబు రిమాండ్‌ను నిరసిస్తూ... ఇచ్ఛాపురంలో టిడిపి మహిళాశక్తి నిరాహారదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆసీ లీలారాణి, టి.మాధవి, రెయ్యి సత్యం, కూన అన్నపూర్ణమ్మ, రెయ్యి భాగ్యం, కె.లక్ష్మి, దేవి, రాణి, దాలమ్మ, రోహిణి, కాళ్ల జయదేవ్, కొండ శంకరరెడ్డి, జె.సంతోష్ పాల్గొన్నారు.

చంద్రబాబును డిమాండ్‌కు పంపడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. శ్రీకాకుళం నగరంలో చేపడుతున్న 8వ రోజు చేపట్టిన దీక్షలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, జిల్లా నాయకులు చిట్టి మోహన్, దుంగ సుధాకర్, పి.ఎం.జె.బాబు, జల్లు రాజీవ్, సీపాన రమా, మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు రిమాండ్‌కు నిరసిస్తూ.. కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీకి చెందిన రైతులు అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చొని వినూత్న నిరసన తెలిపారు.


పలాస : దీక్షలో పాల్గొన్న శివాజీ, శిరీష

కార్యక్రమంలో టిడిపి రైతు సంఘం అధ్యక్షుడు అట్టాడ రవిబాబ్జి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, ఎఎంసి మాజీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, నంబాళ్ల శ్రీనివాస్, గొండు లక్ష్మణరావు, దేవాది సింహాద్రి, బాడాన రవణమ్మ, రెడ్డి అప్పన్న హనుమంతు అప్పలరాజు పాల్గొన్నారు.

నరసన్నపేట పట్టణంలో తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి పాల్గొని సంఘీభావం తెలిపారు..ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసుబాబు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాశీబుగ్గలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో చంద్రబాబు రిమాండ్‌కు నిరసనగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ముందుగా బుధవారం దీక్షలో కూర్చున్న నాయకులకు తిలకం దిద్ది దీక్షను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శివాజీ, ఆయన సతీమణి విజయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలాస ఇంచార్జి గౌతు శిరిష, మాజీ మంత్రి గౌతు శివాజీ, వజ్జ బాబురావు తదితరులు పాల్గొన్నారు.


నరసన్నపేట : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు


కోటబొమ్మాళి : మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న నాయకులు


లావేరు : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని ప్రధాన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని టెక్కలి నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి దువ్వాడ వాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మెరుగు రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలపై సంబంధిత శాఖ అధికారులు వివరణ ఇచ్చారు. మొదటగా హౌసింగ్ శాఖ సంబంధించి గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లకు పెండింగ్ బిల్లులపై చర్చించారు. అలాగే ఒక రూపాయి మాత్రమే ఇల్లు బిల్లు పొంది నాలుగేళ్లుగా ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారుల సమస్యలపై చర్చించారు. ఈ విషయమై కొంతమందికి చెల్లింపులు జరుగుతున్నాయని, మిగతావారికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే చెల్లింపులు చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న వాణి

చేపడతామన్నారు. అలాగే పంచాయతీరాజ్ శాఖపై జరిగిన చర్చలో ఇప్పటివరకు మండలంలో సచివాలయాలు, ఆర్‌బికెలు, హెల్త్ సెంటర్లు తదితర భవనాల నిర్మాణాల స్థితిగతులపై చర్చించారు. మండలంలో 17 బిల్డింగులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని అధికారులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్‌పై జరిగిన చర్చలో మేఘవరం పంచాయతీకి సాగునీరు రావడంలేదని గత సమావేశంలో ప్రశ్నించినా ఇప్పటికీ పనులు కాలేదని ఎంపిటిసి సూరాడ రాజారావు ప్రశ్నించారు. సచివాలయాల్లోని జూనియర్ లైన్‌మేన్లు సచివాలయంలో అందుబాటులో ఉండడం లేదని, దండుగోపాలపురం సర్పంచ్ అశోక్ చక్రవర్తి సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యాశాఖపై జరిగిన చర్చలో గొదలం, పాలతలగాం, కొత్త లింగూడు, శలగపేట గ్రామాల్లోని పలు పాఠశాలలు అభివృద్ధి చేయాలని సభ్యులు ఎంఇఒ చిన్నవాడుకు విన్నవించారు.

ఇటీవల జెడ్‌పి సమావేశంలో పలు పాఠశాలల సమస్యలపై చర్చించానని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్‌పిటిసి వసంత రెడ్డి తెలియజేశారు. ఈ సమావేశానికి పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు హాజరు కాలేదు. మండల కేంద్రంలోని సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి, ఎంపీటీసీలు హాజరు కాకపోవడంపై దువ్వాడ వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెళ్లి జగన్‌నాయకులు, వైస్ ఎంపిపిలు పొందల తులసమ్మ, నక్క చింతామణి, సర్పంచ్‌లు ఎన్ని మన్మథరావు, జోగి రాములమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి రిమాండ్

వజ్రపుకొత్తూరు : ఇచ్ఛాపురం ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వరశెట్టి రాజేష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు కాశీబుగ్గ రూరల్ సిఐ జి.శంకరరావు బుధవారం తెలిపారు. వజ్రపు కొత్తూరుకు చెందిన రాజేష్ తన సహ ఉపాధ్యాయురాలిని 2021లో ఇంటికి తెలియకుండా రహస్యంగా వివాహం చేసుకున్నాడని అన్నారు. వివాహం జరిగిన విషయం బయటకు చెప్పకుండా స్వగ్రామంలోనే మరో యువతితో జూన్ 2022లో నిశ్చితార్థం చేసుకున్నారని తెలిపారు. నిశ్చితార్థం జరిగిన యువతితో సన్నిహితంగా మెలుగుతూ కాబోయే బార్యాభర్తలమే కదా అని నమ్మబలికి లోబరుచుకున్నాడని అన్నారు. యువతి కుటుంబ సభ్యులు పెళ్లి కోసం అడిగినప్పుడల్లా తప్పించుకొనే ప్రయత్నం చేస్తూ వచ్చాడని తెలిపారు. ఈ విషయాన్ని పెద్దలు సమక్షంలో పెట్టి పలు దఫాలుగా చర్చలు జరిపినా పెళ్లికి ససేమిరా అనడంతో చేసేదిలేక పెద్దలు సూచనతో యువతి పోలీసులను ఆశ్రయించిందన్నారు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి బుధవారం అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి పలాస కోర్టులో హాజరుపరిచామని అన్నారు. పలాస మెజిస్ట్రేట్ ఉపాధ్యాయునికి 14 రోజులు రిమాండ్‌కు తరలించాలని ఆదేశించారని తెలిపారు. ఆయనతో పాటు ఎస్ఐ వై.మధుసూదన్ ఉన్నారు.


మొక్కను అందజేస్తున్న డిఎస్‌పి

సబ్ కలెక్టర్‌ను కలిసిన డిఎస్‌పి

టెక్కలి రూరల్ : టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌ను టెక్కలి డిఎస్పి బాలచంద్ర రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించారు. టెక్కలి డివిజన్‌లోని శాంతిభద్రతల పరిస్థితిని సబ్ కలెక్టర్ కు వివరించారు.


పరిశీలిస్తున్న తహశీల్దార్ హైమావతి

కల్వర్టుకు పగుళ్లు

ప్రజాశక్తి- కంచిలి

మండల పరిధిలోని జలంత్రకోట నుంచి గోకర్ణపురం వెళ్లే రహదారిలో గల చెరువుకు ఆనుకొని ఉన్న కల్వర్టు బుధవారం కృంగిపోయింది. చెరువు నుంచి సమీప పొలాలకు నీరు వెళ్లేందుకు రహదారి దిగువ నుంచి నిర్మించిన కల్వర్టు కుంగడంతోపాటు రక్షణగా వేసిన గోడ సైతం పడిపోయింది. దీంతో జలంత్ర కోట నుంచి గోకర్ణపురం, శాసనం గ్రామాలకు రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ హైమావతి ఆర్ అండ్ బి అధికారులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. రహదారి పరిస్థితిని పరిశీలించి భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. రిటైనింగ్ వాల్, కల్వర్టు మరమ్మతులను తాత్కాలికంగా చేపట్టారు. త్వరలోనే శాశ్వత పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి డిఇ రామినాయుడు, ఎఇ మోహన్ రావుతోపాటు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌తోనే ఉద్యోగులకు భద్రత


నారాయణరావు

కోటబొమ్మాళి: పాత పెన్షన్ విధానంతోనే ఉద్యోగులకు భద్రత ఉంటుందని యుటిఎఫ్ జిల్లా సిపిఎస్ కన్వీనర్ గొండు నారాయణరావు అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సిపిఎస్ రద్దు చేసి పాత పింఛను విధానం అమలు చేస్తేనే ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులకు ఆర్థిక భద్రత లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికలు ముందు చేసిన ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సిపిఎస్ ఉద్యోగుల ఆకాంక్షను దృష్టిలో పెట్టుకొని ఇచ్చిన మాటకు కట్టుబడి పాత పెన్షన్ విధానం అమలు చేసి సిఎం తన విస్వాసనీయత నిరూపించుకోవాలని హితవు పలికారు. ఇటీవల సిక్కిం రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిందని అన్నారు.


అవగాహన కల్పిస్తున్న దాసునాయుడు

వన్ ధన్ యోజనపై అవగాహన

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ మహసింగిలో బుధవారం వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో కొత్తూరు, సీతంపేట, హిరమండలం, పాతపట్నం మండలాలకు చెందిన విడివికె సభ్యులకు వెలుగు కార్యదర్శి బి.సంజీవురావు అధ్యక్షతన వన్‌ధన్ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘాలు అభివృద్ధి, వినియోగం, పర్యవేక్షణ కమిటీల కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ కె.దాసునాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే వారికి పట్టం కట్టాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పాతపట్నం నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలని నియోజవర్గ నాయకులు, విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. మండలంలో పడ్డ, గొడ్డ, డబారు, పెద్దపద్మాపురం తదితర గ్రామల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలస, వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, మాజీ సర్పంచ్ పడాల రాజారావు, సిరిపురం యువసేన సభ్యులు పాల్గొన్నారు.


పోస్టర్లను పంపిణీ చేస్తున్న తేజేశ్వరరావు

మొక్కజొన్న పంట పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - పొందూరు

తెగులు సోకడంతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. 'మొక్కజొన్నకు బూడిద తెగులు' శీర్షికన ప్రజాశక్తి జిల్లా పేజీలో 20వ తేదీన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు మండలంలోని గోకర్ణపల్లిలో తెగులు సోకిన పంటలను బుధవారం పరిశీలించారు. పొడతెగలు, కత్తెర పురుగు సోకడంతో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇటీవల మొక్కజొన్న పంట సాగు లాభదాయకంగా ఉండడంతో తామంతా ఆ పంటను సాగు చేసేందుకు ముందుకు వచ్చామని, ఈవిధంగా పంట దెబ్బతినడంతో పెట్టుబడులూ వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎడిఎలు కె.కృష్ణారావు, ఎస్.వెంకటరావు, శాస్త్రవేత్తలు సంధ్యారాణి, బి.స్వాతి, రాజశేఖర్, అమరజ్యోతి, సూర్యకుమారి, మండల వ్యవసాయ అధికారి బెండి బాబ్జీ పాల్గొన్నారు.

'ఐతమ్' అధ్యాపకులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగానికి చెందిన 30 మంది అధ్యాపకులకు 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎంబెడెడ్ సిస్టమ్స్ అండ్ ఐఒటీస్' అనే అంశంపై వారం రోజులపాటు ఆన్లైన్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. చండీఘర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ అండ్ రీసెర్చ్ (ఎన్‌ఐటిటిఆర్) కేంద్ర విద్యాశాఖ మంత్రిత్వశాఖలు సంయుక్తంగా నిర్వహించే ఈ శిక్షణకు ఎన్‌ఐటిటిఆర్ నుంచి కో-ఆర్డినేటర్లుగా డాక్టర్ కనీకాశర్మ, ఐతమ్ నుంచి కో-ఆర్డినేటర్‌గా ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ బి. రామారావు, సహాయ కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ జి.కష్ణమోహన్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులను శతశాతం వినియోగించుకోవాలని, మార్పులను ఎప్పటి కపుడు తెలుసుకొని విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెండ్డీ డీన్ డాక్టర్ డి. ఆజాద్‌లు ఈ తరగతులను పర్యవేక్షిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు వివరించారు.


శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

ఆరోగ్య మేళా విజయవంతం


పొందూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ప్రతినెలా నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామదాసు పిలుపునిచ్చారు. ఆయుష్మాన్ భవ: కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆరోగ్య మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, ప్రసవ, శస్త్రచికిత్స, చెవి, ముక్కు, గొంతు, చిన్నపిల్లల, మానసిక ఆరోగ్య నిపుణులతో ప్రతినెలా మూడు వారాలు ప్రత్యేకంగా సేవలను అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 20, 25, 29వ తేదీల్లో ఈ ఆరోగ్య మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అనీల్‌కుమార్, సుజాత, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సోంపేట: వారానికి ఒకసారి సోంపేట ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించే ఆరోగ్యమేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి డాక్టర్ దాసు కోరారు. బుధవారం నిర్వహించిన ఆరోగ్య మేళాలో పాల్గొన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అవసరమైన వారికి మందులు అందజేశారు.

దోకులపాడు మత్స్యకార సొసైటీ అధ్యక్షునిగా పాపారావు

వజ్రపుకొత్తూరు : దోకులపాడు మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా యంపల్లి పాపారావును ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం దోకులపాడులో దోకులపాడు మత్స్యకార సొసైటీ ఎన్నికలు జరిగాయి. మత్స్యకార సొసైటీలో 155 మంది సభ్యులుండగా ఓటరు జాబితాలో 165 మంది సభ్యులుగా ఎలా నమోదు చేశారని మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ వర్గం ప్రశ్నిస్తూ ఎన్నికలను బహిష్కరించారు. ఎన్నికల అధికారిగా రణస్థలం ఎఫ్‌డిఒ గంగాధర్ వ్యవహరించారు. సొసైటీ ఎన్నికల నిబంధన ప్రకారం 27 మంది సభ్యులు హాజరైనా కోరం మేరకు ఎన్నిక జరపాల్సిందేనని ఎన్నికల అధికారి గంగాధర్ తెలిపారు. సొసైటీ ఎన్నికల కోసం హాజరైన 96 మంది సభ్యుల నుంచి సంతకాలు సేకరించారు. సొసైటీ కి తొమ్మిది మంది డైరక్టర్‌లుండగా తొమ్మిది నామినేషన్‌లు మాత్రమే రావడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. డైరక్టర్లుగా యంపల్లి పాపారావు, పల్లేటి జోగారావు, వాసుపల్లి ఎర్రన్న, వడ్డి ఢిల్లేశ్వరరావు, గండుపల్లి జంగమయ్య, లండ దేవరాజ్, వడ్డి కామేశ, పుసే దానేషు, పల్లేటి ఈశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. వీరంతా పాపారావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పాపారావు మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతి కోసం తనవంతు కషి చేస్తానన్నారు. సొసైటీని అన్ని విధాలా ముందంజలో ఉంచడం తన బాధ్యత అని అన్నారు. అధ్యక్షుడిగా మరోసారి అవకాశం ఇవ్వడం పట్ల సొసైటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సర్పంచి ప్రతినిధి వడ్డి కరుణాకర్, ఎంపిటీసీ ప్రతినిధి కొయిరి ఢిల్లేశ్వరరావు, వడ్డి కామరాజు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రం అందజేస్తున్న గంగాధర్


చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రజని

మహిళా బిల్లుపై హర్షం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రధాని నరేంద్ర మోడీ పాలనతోనే మహిళల అభివృద్ధి జరుగుతుందని బంటుపల్లి సర్పంచ్ నడుకుదిటి రజని అన్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెం ఎచ్చెర్ల బిజెపి క్యాంప్ కార్యాలయంలో సర్పంచ్ రజని ఆధ్వర్యంలో బుధవారం నారీమణుల సందడి చేశారు. నారీ శక్తి వందన్ చట్టం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా బిజెపి అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ నడుకుదిటి మహాలక్ష్మి, ఎచ్చెర్ల మండల పార్టీ అధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

12 మంది రక్తదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

లయన్స్‌క్లబ్ అరసవల్లి ఆధ్వర్యాన నగరంలోని న్యూ బ్లడ్‌బ్యాంకులో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. క్లబ్ చైర్మన్ హారికాప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన శిబిరంలో 12 మంది పాల్గొని రక్తదానం చేశారు కార్యక్రమంలో నూతన అధ్యక్షులు కరణం శోభారాణి, కార్యదర్శి రౌతు శ్రీనివాసరావు, కోశాధికారి టి.అప్పల చంద్రశేఖర్‌నాయుడు, బ్లడ్‌బ్యాంకు మేనేజరు మణికంఠ పాల్గొన్నారు.

సొంత నిధులను వినియోగించుకుంటాం



ప్రమాణం చేస్తున్న కార్యనిర్వాహక సభ్యులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిధిలోని 1176 స్వయం శక్తి సంఘాల సేవింగ్ ఖాతాల్లో పొదుపు చేసుకున్న సొంత నిధులను పూర్తిగా వినియోగించుకుంటామని మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు ప్రమాణం చేశారు. ఎపిఎం పైడి కూర్మారావు ఆధ్వర్యాన పట్టణంలోని మండల మహిళా సమాఖ్య మహాజనసభ సమావేశం బుధవారం నిర్వహించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కార్యనిర్వాహక సభ్యులు బ్యాంకు ఖాతాల్లోని పొదుపు మొత్తాలను 30 గ్రామ సంఘాల పరిధిలోని 1176 స్వయంశక్తి సంఘాల్లో నిల్వ ఉన్న సభ్యుల పొదుపు రూ.13.17 కోట్లను సంఘం సభ్యుల అవసరం మేరకు ఇప్పటి వరకు కేవలం రూ.3.44 కోట్లు మాత్రమే అంతర్గత అప్పులుగా వినియోగించుకున్నామని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.10 కోట్లు లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తామని కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, కార్యనిర్వాహక సభ్యులు తమ్మినేని ధనలక్ష్మి, బొడ్డేపల్లి వేణమ్మ, రేణుకా మొహరన్ బి.రోజా, కళావతి పాల్గొన్నారు.


కవిటి : లడ్డూతో భీమారావు దంపతులు

లడ్డూ అ'ధర'హో

కవిటి : సోమవారం ప్రారంభమైన వినాయక చవితి ఉత్సవాలు బుధవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో నిమజ్జన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నిర్వహిస్తున్న వినాయక లడ్డు వేలంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అత్యధిక ధరకు కైవసం చేసుకుంటున్నారు. కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామంలోని మారేడు దుర్గా కమిటి నిర్వహించిన వేలంలో గ్రామస్తులు పూడి భీమారావు, సుశీల దంపతులు రూ.20, 500లు చెల్లించి లడ్డు కైవసం చేసుకున్నారు. అదే విధంగా రామాలయం వీధి లడ్డును రూ.11, 500లకు బొరివంక గ్రామానికి చెందిన పండి నాగరత్నం, రజక వీధి లడ్డును రూ.12 వేలకు యాంద్రాపు ఈశ్వరరావు, రామయ్యపుట్టుగ వరసిద్ధి వినాయక లడ్డు రూ.10వేలకు బెందాళం వెంకటరావు కైవసం చేసుకున్నారు.కొత్తపుట్టుగని పాఠశాల వీధిలో మొదటి లడ్డు నర్తు మోహనరావు రూ.63 వేలు, రెండో లడ్డు నర్తు కృష్ణమూర్తి రూ.46 వేలకు కైవసం చేసుకున్నారు.

పొందూరు: మండలంలోని గోరింటలో శ్రీలంక వీధిలో ఉన్న వినాయక సన్నిధానంలోని లడ్డూకు కమిటీ సభ్యులు బుధవారం నిర్వహించిన వేలం పాట ఉత్కంఠత రేపింది. ఈ సందర్భంగా రూ.5,500లకు గ్రామానికి చెందిన పొన్నాడ రామారావు ఈ లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాడాన వెంకట కృష్ణారావు, పి.జి.రావు, బి.సందీప్, కె.సంతోష్, పి.శ్రీను, కె.శంకర్, బి.వెంకటసీతారాం, వై.వరద, బి.శ్రీను, కె.హేమంత్, సిహెచ్.ప్రసాద్ పాల్గొన్నారు.


పొందూరు : లడ్డూను అందజేస్తున్న కమిటీ సభ్యులు

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా గోపాల్


గోపాల్

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన రైస్ మిల్లర్ కెవి గోపాల్ ముచ్చటగా మూడోసారి జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఈ ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. ఈ సందర్భంగా జిల్లా రైస్ మిల్లర్స్ కార్యదర్శి కెవి గోపాల్ విలేకరులతో మాట్లాడుతూ వరుసగా మూడోసారి తనను జిల్లా రైస్ మిల్లర్స్ కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు జిల్లా నాయకత్వానికి, సహ రైస్ మిల్లర్లకు ముందుగా ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. లేవీ సేకరణలో ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ప్రభుత్వ సూచనలు, సలహాలు పాటించి, మిల్లర్లందరికీ అందుబాటులో ఉండి అండదండలు అందిస్తామన్నారు. కె.వి. గోపాల్ ఎన్నిక పట్ల శ్రీకాకుళానికి చెందిన ఓన శివ, కోరాడ చంటి, హిరమండలానికి చెందిన ధనుంజయ, పలాసకు చెందిన డోకి రామారావు, వీరస్వామి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


మొక్కలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి- పలాస

ఈ నెల 30 నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల వద్ద జరగబోవు సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు పలాస నుంచి ఇద్దరు ఎంపికయ్యాయ్యారు. జెడ్‌పి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న జి.ఛాయకిరణ్, విద్యావాణి కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న శిష్టు ప్రియమణి ఇటీవల సానివాడలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందారు. వీరికి కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం వద్ద బాల్ బ్యాట్మెంటన్ కోర్టులో గ్రీన్‌ఆర్మీ వీరిని మొక్కలు, బాల్ బ్యాట్మెంటన్ క్రీడా సామగ్రి అందించి అభినందించారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ గౌరవ అధ్యక్షులు బత్తిన ఓంకార్, ఉపాధ్యాయులు కిషోర్ పాత్రో, బోకర దుర్యోధన, ఇరిగేషన్ అధికారి పి.శ్రీనివాసరావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఎన్.ఉపేంద్ర, ఆర్‌టిఒ సహాయకులు డి.వైకుంఠరావు, పలాస యూత్ నాయకుడు తామరశెట్టి ఫ్రాన్సిస్, కాశీబుగ్గ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు వై.కె.హరినాథ్, టి.గణేష్‌లు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సర్వేశ్వరరావు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

బూర్జ : అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు బుధవారం అగ్నిమాపక శాఖ అధికారి అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాలకొండ అగ్నిమాపక శాఖ అధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు నివారించే పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కార్యక్రమాలను ప్రదర్శించి వాటిపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.తవిటి నాయుడు, ఎన్ఎస్ఎస్ పిఒ ఠాగూర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ప్రధానోపాధ్యాయులు రామరాజు సమయంలో జరిగిన నాడు-నేడు పనుల్లోను, మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలతోపాటు పలు విషయాలపై విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఎస్ఎ అధికారులు బుధవారం విచారణ జరిపారు. పాఠశాలలో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యాలు లేవంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు మూడు రోజులు క్రితం విచారణ చేసిన అధికారులు, రెండోసారి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎండిఎం రికార్డుల వివరాలను ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరావును అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు పనులపై ఎఇ కిరణ్‌కుమార్ వివరణ తీసుకున్నారు. వీటిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు అధికారులు కామేశ్వరరావు, రాంబాబులు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి ప్రవాస భారతీయుడు సాయం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి కెనడాలో ఉద్యోగం చేస్తున్న ప్రవాస భారతీయుడు గురుగుబెల్లి సుధాకర్ తన వంతు సాయాన్ని అందజేశారు. పాఠశాలకు రూ.లక్ష విలువ చేసే కంప్యూటర్, హోమ్ థియేటర్, ప్రొజెక్టర్‌ను వితరణగా అందజేశారు. వీటిని గ్రామానికి చెందిన గురుగుబెల్లి నరసయ్య చేతులు మీదుగా ప్రధానోపాధ్యాయులు సుగ్గు కాసులుబాబుకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వావిలపల్లి తిరుమలరావు, వై.రాజారావు, జి.శ్రీరామ్మూర్తి, వి.చలపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- కవిటి

చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలంలోని బెలగాంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా గర్భిణులకు, బాలింతలకు నేరుగా ఇంటికే పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎసిడిపిఒ లావణ్య, సూపర్ వైజర్ కృష్ణవేణి పోషకాహార లోపం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంగన్వాడీల ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు వివరించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంతో ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు, ఎంపిటిసి ప్రతినిధి సంతోష్‌కుమార్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, పల్లవి, పుష్ప, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : ప్రదర్శించిన పౌష్టికాహార పదార్థాలు

ఇచ్ఛాపురం : పౌష్టికారంతోనే మంచి ఆరోగ్యం పొందవచ్చని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగరాణి అన్నారు. మండలంలో ధర్మాపురంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంతో ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట రుక్మిణి, విశ్వనాథ్‌రెడ్డి, సూపర్‌వైజర్ బి.సుజాత, ఎస్.నీలవేణి పాల్గొన్నారు.

గాడి తప్పిన చట్టబద్ధ పాలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నియంతృత్వ పోకడలను ప్రభుత్వం అవలంభిస్తూ చట్టబద్ద పాలన గాడితప్పేందుకు కారణమవుతోందని పలువురు అఖిలపక్ష పౌర సమాజం, మేధావులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు. బుధవారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో లోక్‌సత్తా ఆధ్వర్యాన 'చట్టబద్ద పాలన' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు పంచాది రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చిందని, పోలీసులను తన వ్యక్తిగత సైన్యంలా మార్చుకుని నియంతలా పాలన సాగిస్తోందని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ అవహాస్యం పాలవుతుందన్నారు. ప్రభుత్వ ధనం, ఆస్తులు దుర్వినియోగం చేసి దోపిడి చేసే హక్కు ఎవరికీ లేదని, అలా దోపిడి చేస్తున్న వారే నిజమైన దేశ ద్రోహులన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బవిరి కష్ణమూర్తి మాట్లాడుతూ యువత చైతన్యవంతం కావాలని, సమాజం పట్ల బాధ్యతతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని అభిప్రాయపడ్డారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో లోక్‌సత్తా అధ్యక్షులు ప్రకాష్ కపిల్‌తోపాటు కొత్తకోట పోలినాయుడు, నగర టీడీపీ అధ్యక్షుడు మాధారపు వెంకటేష్, జనసేన నాయకులు పేడాడ రామ్మోహన్, అర్జునరావు, బుక్కా యుగంధర్, కూన తవిటినాయుడు, మూల నారాయణరావు, వాసుదేవ రావు, తదితరులు మాట్లాడారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

స్టడీ మెటీరియల్స్ అందజేత

టెక్కలి : మండలంలోని తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు బిగ్‌హెల్ప్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రాజెక్టు డైరెక్టర్ రామముని రమేష్‌కుమార్ స్టడీ మెటీరియల్స్, కాపీరైటింగ్ పుస్తకాలు, రికార్డుషీట్స్, వాటర్ బాటిల్స్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.ధర్మారావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల విద్యార్థుల ఆర్థిక సహకారం అందించడంలో చూపిన చొరవ ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో బిగ్‌హెల్ప్ చైర్మన్ ఎన్.కృష్ణారావు, బొడ్డేపల్లి విద్యావతి, లత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురం గ్రామానికి చెందిన తమ్మినాన రాజారావు గత కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. సుమారు నాలుగు నెలలుగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నగరంపల్లి ఉన్నత పాఠశాల 2003వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.37 వేలు వసూలు చేసి సహ విద్యార్థి కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో శిష్టు గౌతమ్, టొంప భాస్కరరావు, సింగారి లీలా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సందర్శనలే మేలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

వరి పంటలో ప్రస్తుతం ఎటువంటి చీడపీడలు సంక్రమించాయో క్షేత్ర సందర్శన ద్వారా తెలుసుకోవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. నీలవేణి అన్నారు. బుధవారం శ్రీకాకుళం మండలంలోని బైరి, గార మండలంలోని బూరవిల్లి గ్రామాల్లోని వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వరి పొలంలోని పొటాషియం లోపాన్ని గుర్తించామని, దాని నివారణకు ఎకరాకు 15 కిలోల పొటాషియాన్ని వాడాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులకు జీవన ఎరువుల ప్రాముఖ్యతను, వాటి ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎస్. కిరణ్ కుమార్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ లావణ్య, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ వార్షికోత్సవం

ఆమదాలవలస : విరాట్ విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. బుధవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మద్విరాట్ విశ్వకర్మ 39వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణకార, కుమ్మరి, వడ్ల, కంచరి, శిల్ప వంటి వివిధ వత్తులను సష్టించి సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసేందుకు ఆయన చేసిన కషి, సేవలను కొనియాడారు. అనంతరం విశ్వకర్మ ప్రతినిధులు శాలువతో గాంధీని సన్మానించి సత్కరించారు. వైకుంఠరావు, రాపాక మాజీ ఎంపీటీసీ సూర్యారావు, విజయరమణారావు, రాజశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగన్మోహనరావు

బ్లడ్ గ్రూపుపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్ : ప్రతిఒక్కరూ బ్లడ్ గ్రూపులపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా అత్యవసరమైన సమయాల్లో రక్తదానం చేసేందుకు అవకాశం ఉంటుందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం, రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ విభాగాలు సంయుక్తంగా రక్త గ్రూపుల నిర్ధారణ శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్త సమూహాల నిర్ధారణ, రక్తవర్గ హిమోగ్లోబిన్ పరిమాణ పరీక్షలు, అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స తదితర వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ మహిళా విద్యార్థులు రక్తం గ్రూప్‌లను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. వాటి ఆవశ్యకత, హెచ్‌బి పరిమాణం వాటిపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో జంతుశాస్త్ర విభాగాధిపతి ఐ.హేమపద్మజా, లెక్చరర్ వై.రవికుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ రుద్రరాణి, ఐక్యూ కో-ఆర్డినేటర్ పద్మావతి పాల్గొన్నారు.

అసోసియేషన్‌ను చీల్చేందుకు కుట్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న రహదారులు, భవనాల శాఖ పరిధిలో 1989 నుంచి రిజిస్టర్డు యూనియన్‌గా ఎపి ఆర్అండ్‌బి ఎంప్లాయిస్ అసోసియేషన్ పని చేస్తుండగా, కొన్ని విచ్ఛిన్న శక్తులు చీల్చడానికి ప్రయత్నిస్తున్నాయని, ఉద్యోగులు వీరి విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ పాపారావు, యువి రాణాపత్రాప్‌లు ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఉద్యోగ సంఘాల నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా నెల్లూరులో వేరే కుంపటి రాజేసి అక్కడ పని చేస్తున్న సూపరెంటెండెంట్ ఇంజినీరు సమక్షంలో కార్యాలయ పని వేళల్లో ఎన్నికలు నిర్వహించడం సరైన విధానం కాదన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు సంఘం ఉండగా దానిని కాదని కొంత మంది చీల్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యోగులను రెచ్చగొట్టే రీతిలో సంఘంలో చిచ్చు పెడుతున్నారని, ఉద్యోగులెవరూ వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పూండి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు కోరారు. పూండి రైల్వే స్టేషన్‌కు విశాఖపట్నం సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఎం.వి.రమణమూర్తి బుధవారం వచ్చారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం ంఅందజేశారు. మూడు మండలాలకు కూడలిగా విద్య, వైద్యం, వ్యాపార పరంగా పూండి అభివృద్ధి చెందుతుందని అన్నారు. కిడ్నీ రోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు విశాఖపట్నం, బరంపురం, భువనేశ్వర్ తదితర ప్రాంతాలకు వైద్య సేవలు పరంగా వెళ్లాల్సి వస్తోందని అన్నారు. దీంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. రూ.2 కోట్లతో కొత్తగా మంజూరైన బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఆయనతో పాటు సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహేశ్వరరావు, కణితి వెంకట భగవాన్, జోగారావు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు


పలాస : పరామర్శిస్తున్న గౌతు శిరీష

పలువురికి పరామర్శ

పలాస : మండలంలోని బొడ్డపాడుకు చెందిన పోతనపల్లి నాగేశ్వరరావు, మద్దిలి లచ్చయ్య, సుమాదేవి గ్రామానికి చెందిన స్వామి కుటుంబాలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష బుధవారం పరామర్శించారు. మృతుల గల కారణాలను కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు ఉన్నారు.

పోలాకి: మండలంలో బుధవారం పలు కుటుంబాలను జడ్పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య పరామర్శించారు. అంపలాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సీనియర్ వైసిపి నాయకులు నల్లాన శ్రీధర్ బాలకృష్ణ అనారోగ్యంతో ఇటీవల మతి చెందారు. చీడివలస గ్రామంలో చెక్కా చిన్నంనాయిడు, చెల్లాయివలస గ్రామంలో బమ్మిడి వెంకట రమణ అనారోగ్యంతో మతి చెందారు. వారి కుటుంబ సభ్యులను చైతన్య పరామర్శించారు. వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు రెంటికోట త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.


లోకేష్‌తో వెంకటరమణ, రామ్మోహన్‌నాయుడు

లోకేష్‌ను కలిసిన కలమట

ప్రజాశక్తి - కొత్తూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా.లోకేష్‌ను బుధవారం ఢిల్లీలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి కలిశారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సంఘీభావం ప్రకటించారు. లోకేషను కలిసిన వారిలో శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు.రామ్మోహన్ నాయుడు ఉన్నారు.


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- లావేరు

మురపాక జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.అరుణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.సూరిబాబు, ఉపాధ్యాయులు డి.వి.దుర్గాప్రసాద్, కె.ఆనందరావు, ఆఫీస్ సబ్ ఆర్డినేట్ కె.అప్పలరాజులు పని చేసి ఇటీవల బదిలీ అయ్యారు. వీరికి పాఠవాల సిబ్బంది, గ్రామస్తులు బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తేనెల విద్యాసాగర్, ఎంపిటిసి తేనెల సురేష్‌కుమార్, పెయ్యల లక్ష్మణరావు, మురపాక సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు, ప్రధానోపాధ్యాయులు కె.వి.ఎస్.ఎస్ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


భూ హక్కు పత్రాలను అందజేస్తున్న ఎంపిపి దేవదాస్ రెడ్డి

భూ హక్కు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని కొల్లూరు సచివాలయ పరిధి ఎఎస్‌పల్లిలో బుధవారం స్థానిక ఎంపిపి దేవదాసు రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి దేవదాసు రెడ్డి మాట్లాడుతూ ఈ పత్రాలతో రుణాలు పొందవచ్చని సూచించారు. సచివాలయ పరిధిలోని 278 మంది లబ్ధిదారులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పైల లక్ష్మీనారాయణ, సర్వేయర్ శివకుమార్, వీఆర్వో కిరణ్ కుమార్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.